క్లుప్తంగా

ఆస్పత్రి అభివృద్ధికి కృషి



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎం.వెంకట రమణ, కమిటీ సభ్యులు బండారు మంగ, యడ్ల నాయుడు తదితరులు సమావేశమై ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రెండు కొత్త కంప్యూటర్లను, లేబోరేటరీకి సంబంధించిన ఆధునిక పరికరాలను పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోకం రామునాయుడు, బండారు శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసరావు, ఫార్మాసిస్టు శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ అనిత, ల్యాబ్ టెక్నీషియన్ జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకట సూర్యారావు

సింహాచలం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున పెందుర్తి మండలం రాతిచెరువు వద్ద పెందుర్తి నుంచి ఆనందపురం రహదారిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా ఎల్.కోట సమీపంలోని గొలజాం గ్రామానికి చెందిన కోట్ని వెంకట సూర్యారావు (36) కొత్తవలస సమీపంలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా చిన్నపాప కూడా ఉంది. ప్రస్తుతం భార్య, పాప ఇద్దరు ఆనందపురం మండలం మామిడిలోవలో అత్తవారి ఇంట్లో ఉన్నారు. భార్య, కూతుర్ని చూసేందుకు బుధవారం రాత్రి మామిడిలోవ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి గురువారం తెల్లవారుజామున గొలజాం బయలుదేరాడు. ఈ తరుణంలోనే రాతిచెరువు వద్ద గతుకుల రోడ్డుపై ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. వెనుక వస్తున్న లారీ అతనిపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలతో పర్యావరణ సమతుల్యత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ ఆలయ ఆవరణలో సంపంగి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీ ఉపాధ్యక్షుడు విందుల నూకరాజు మాట్లాడుతూ ఆలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో విరివిగా మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, శేఖర్, రామస్వామి, అప్పారావు, లోకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌బీఎస్ ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న ఫ్యామిలీ బెనిఫిట్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో 408 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ప్రతీ ఓటరు రెండు ఓట్లు వేసి, ఇద్దరు అభ్యర్థులను ఎన్నుకోవల్సి ఉంటుంది. కాగా.. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ప్యానల్ నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవగా, యునైటెడ్ ఫ్రంట్ ప్యానల్ నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు.

హిందీ లోయర్ పరీక్షల గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ - చెన్నై వారు నిర్వహించే లోయర్ పరీక్షలకు గడువు రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 10 వరకు పెంచినట్టు ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు హాజరయ్యే ఔత్సాహికులు 89856 47419లో సంప్రదించాలని కోరారు. ఫిబ్రవరి 11, 12న భీమిలి కేంద్రంగా లోయర్, హయ్యర్ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు.

అవ్వాతాతల మోముల్లో ఆనందం



95వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



93వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు

పండగలా పింఛన్ల పంపిణీ

సింహాచలం: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. వార్డు పరిధిలోని వరలక్ష్మీనగర్‌లో గురువారం పింఛన్ల పంపిణీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 499 నుంచి 504 సచివాలయాల పరిధిలో ఉన్న 56 మందికి కొత్త పింఛన్లతోపాటు పాతవారికి పెన్షన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పెరిగిన రూ.2,750 పింఛనును అందజేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. అవ్వాతాతల జీవితాల్లో ఆనందం నింపేందుకు పింఛను నగదుని పెంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. పెరిగిన పెన్షనత్ ప్రతీ అవ్వాతాత మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీడీఓ వై.శ్రీరామ్, సీఓ అరుణ్‌కుమార్, మార్కెటింగ్ డైరెక్టర్ అయిత ఎర్రయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ మనలత జోబ్‌దాస్, పార్టీ 95వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, పార్టీ నాయకులు కంచిబోయిన సంతోష్, బొడ్డు దేవుడుబాబు, గంట్ల నర్సింహమూర్తి, లక్ష్మి, అప్పికొండ, రాంబాబు, కాళ్ల సురేష్, పులమరశెట్టి లక్ష్మణ్, చిట్టిబోయిన అప్పలరాజు, రోమాల నూకరాజు, సచివాలయం సిబ్బంది, ఆర్‌పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

93వ వార్డులో....

93వ వార్డులోని 525, 526 సచివాలయాల పరిధిలో గురువారం పింఛన్ల వారోత్సవాలను నిర్వహించారు. లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ 93వ వార్డు అధ్యక్షుడు దాసరి రాజు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క శ్రీను, నక్క రవి, రాజు, డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.పురంలో...

పెందుర్తి మండలం ఎస్‌ఆర్‌పురంలో పింఛన్ల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 21మంది కొత్త లబ్ధిదారులకు రూ.2,750 చొప్పున పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుపాడ అంజి, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో...

పెందుర్తి మండలం గుర్రంపాలెంలో పింఛను వారోత్సవాలను నిర్వహించారు. గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు కేక్ కట్‌చేసి లబ్ధిదారులకు అందజేశారు. అలాగే కొత్తగా 32మందికి రూ.2750 చొప్పున పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నక్క కనకరాజు, సారిపల్లి వరలక్ష్మి, సారిపల్లి గణేష్, అక్కిరెడ్డి వెంకటరమణ, కోటి పాల్గొన్నారు.

97వ వార్డులో..

97వ వార్డు నూతనంగా మంజూరైన 94 పింఛన్లను వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంట్ల వెంకట లీలావతి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మొగలిపురంలో..



మొగలిపురంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: పింఛన్ల వారోత్సవాలలో భాగంగా మండలంలోని మొగలిపురంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి చేతులమీదుగా పింఛన్లను అందజేశారు. 425 మంది లబ్ధిదారులకు రూ.2,750 చొప్పున అందజేయడంతో పాటు కొత్తగా 13 మందికి మంజూరైన వితంతు, వృద్ధాప్య పింఛన్లను అందజేశారు. 8వ తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను అందజేశారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న పది మంది లబ్ధిదారులకు ఉచిత కరెంట్ మీటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, పార్టీ యువజన విభా గం అధ్యక్షులు యడ్ల నాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఐడీ బాబు, ఎంపీటీసీ తమరాణ సన్యాసమ్మ, నాయకులు గండి బండయ్య,పైల రామునాయుడు, సిరపరపు నవీన్, బత్తిన వెంకటేష్ పాల్గొన్నారు.



ఎస్‌ఆర్ పురంలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ మధుపాడ నాగమణి



గుర్రంపాలెంలో పింఛన్లు అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు కనకరాజు



97వవార్డులో పింఛన్లను అందజేస్తున్న గంట్ల వెంకట లీలావతి

నిబద్ధతకు మారుపేరు రామకృష్ణంరాజు

మురళీనగర్(విశాఖ ఉత్తర): శ్రీదేవి కేబుల్ టీవీ చానల్ చైర్మన్ దివంగత ఇసుకపల్లి రామకృష్ణంరాజు నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. మురళీనగర్‌లో గురువారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మేయర్ దంపతులు పాల్గొని రామకృష్ణంరాజు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామకృష్ణంరాజు అతి సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. డిజిటల్ ప్రసారాల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టించారని, కేబుల్ రంగంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. రామకృష్ణంరాజు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఇసుకపల్లి రామకృష్ణంరాజుకు పలువురు



నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకట కుమారి దంపతులు

ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, మహారాజా బ్యాంకు చైర్మన్ మంతెన రామకృష్ణరాజు, ఎంఎస్‌వోలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

8న వైదిక సదస్సు

సీతంపేట(విశాఖ ఉత్తర): శంకరమఠంలో ఈ నెల 8వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పురోహిత, అర్చక వర్గ సభ్యులతో వైదిక సదస్సు నిర్వహించనున్నారు. విజయయాత్ర సందర్భంగా ఆయన శంకరమఠానికి ఇటీవల విచ్చేయగా.. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్సు నిర్వహించనున్నారు.

నగర సుందరీకరణకు తొలి ప్రాధాన్యం

ఆరిలోవ(విశాఖ తూర్పు): సుందర విశాఖ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందని, సదస్సులు, సమ్మిట్‌లు, నేషనల్ ఈవెంట్లు జరుగుతాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ముఖ్యంగా బీచ్ రోడ్డులో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్‌లు, ప్రజా మరుగుదొడ్ల శుభ్రత వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త జాలరిపేట మరుగుదొడ్ల ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు ఎత్తివేయించాలని, ఆ ప్రదేశంలో మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డీసీపీ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, సహాయక ఇంజినీరు పాల్గొన్నారు.



ఫిషింగ్ హార్బర్ రోడ్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

తిరుమల నగర్‌లో సీడీఎంఏ బృందం పర్యటన

స్వచ్ఛత కార్యక్రమాలపై ప్రశంసలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో సీడీఎంఏ అధికారుల బృందం పర్యటించింది. గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పర్యటించిన అధికారులు, కాలనీలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలను ప్రశంసించారు. ముఖ్యంగా కాలనీవాసులు చేస్తున్న కమ్యూనిటీ కంపోస్టు, టెర్రస్ గార్డెన్, ఇంకుడు గుంతలు, చెత్త విభజన, హోం కంపోస్టు, ప్లాస్టిక్ నిషేధం.. పార్కులు, ఇల్లు, అపార్ట్‌మెంట్ గోడలపై అవగాహన పెయింట్లు, ఖాళీ స్థలంలో తోటల పెంపకం తదితర అంశాలను పరిశీలించి, కాలనీవాసులను అభినందించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, వసంతరెడ్డి, భాస్కరరావు, శ్రీరాములు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



తిరుమల నగర్‌లో టెర్రస్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీఎంఏ అధికారులు

7న డిజిటల్ సమ్మిట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్-11లోని శృష్టి వరల్డ్ పాఠశాలలో ఈ నెల 7న 'పాఠశాల స్థాయి డిజిటల్ సమ్మిట్-2023' నిర్వహిస్తున్నామని పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. మేఘన తెలిపారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ శిక్షణ ఇచ్చేందుకు 'రెడీనెస్ ఫర్ ది ఫ్యూచర్ టెక్నాలజీ జాబ్ మార్కెట్స్' థీమ్‌తో ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ పి. సుశీలరాణి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభిస్తారని, అతిథులుగా అర్జున అవార్డు గ్రహీత, ఇండియన్ స్కేటింగ్ కోచ్ అనుప్ కుమార్ యమ, ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎన్.శేషారెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇ.చంద్రిక పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నామని సెంటర్ ఇన్‌చార్జి జి.మాధవశెట్టి తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌లో మూడు నెలలు, ప్లంబింగ్ అండ్ జనరల్‌లో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌కు పదో తరగతి, ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన వారు, ప్లంబింగ్ అండ్ జనరల్ ట్రేడుకు 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా బస్‌పాస్ అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోగా పెదగంట్యాడలోని వేమన ఐటీఐ పక్కన ప్రభుత్వ పాత సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 91332 42666, 94935 28069 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే..

విశాఖ స్పోర్ట్స్: అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్ట్ మైదానంలో ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిసెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అండగా నిలిచే పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. వీజేఎఫ్‌కు సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన దుర్గారావు, శ్రీదేవి చానల్ రామకృష్ణరాజు, బీజేపీ నాయకుడు పి.వి.చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు, క్రికెట్ జట్ల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అథ్లెటిక్స్, ఇండోర్ క్రీడలు ముగియగా.. క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

లోకల్ చానల్, కెమెరామెన్ జట్ల విజయం

తొలిరోజు జరిగిన పోటీల్లో లోకల్ చానెల్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ప్రజాశక్తి జట్టుపై విజయం సాధించింది. ప్రజాశక్తి జట్టు తొలుత బ్యాటింగ్ చేసి మూడు వికెట్లకు 87 పరుగులు చేయగా.. లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో కెమెరామెన్ జట్టు ఆరు వికెట్లకు 127 పరుగులు చేయగా.. వెబ్ చానల్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులతో ఆటను ముగించింది.

ఘనంగా ధనుర్మాస పూజలు

సింహాచలం : సింహగిరిపై గురువారం ధనుర్మాసం పూజలను విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొర్రై, గోదాదేవికి బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈపూజలను నిర్వహించారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసం పూజలు

పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాసం పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవాకాలంని విశేషంగా నిర్వహించారు. గోదాదేవికి వైభవంగా పూజలు నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఈపూజల్లో పాల్గొన్నారు.భక్తులందరినీ సామూహికంగా వేంజేపచేసి ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ ఈపూజలను నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం పూజలను విశేషంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంజేపచేశారు. పాశుర విన్నపా పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈపూజలు నిర్వహించారు.



సింహగిరిపై తిరువీధిలో గోదాదేవి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు



వెంకటాద్రిపై గోదాదేవికి హారతి అందజేస్తున్న అర్చకుడు రామానుజమ్

బలరామాలంకరణలో దర్శనమిచ్చిన అప్పన్న



బలరామాలంకారంలో కొలువుదీరిన అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం



బలరామాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా అప్పన్న

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి బలరామాలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని బలరాముడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంజేంపచేశారు. ఆళ్వారులను మరొక పల్లకిలో వేంజేంపచేశారు. సాయంత్రం సింహగిరి మాడవీధిల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా స్వామికి హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం

సబ్బవరం : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తెలిపారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీ గ్రంథాలయాధికారి రమణ మాట్లాడుతూ ఇప్పటికే కొత్త 888 పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ పుస్తకాలను ప్రతి మండలంలోని మండల శాఖా గ్రంథాలయాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారిణి జి.సత్యవతి, ఎన్ఎస్ఎస్ అధికారి పీపీసీహెచ్ వరప్రసాద్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు

భక్తిశ్రద్ధలతో మేల్కొలుపు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో దేవాలయ కేంద్రంగా గురువారం మేల్కొలుపు కార్యక్రమం భక్తులు నిర్వహించారు. కార్యక్రమంతో గ్రామాల్లో యువకులు, మాతృమూర్తులు, పెద్దల్లో భక్తి భావం పెరిగి పూర్వ వైభవం కనిపిస్తుందని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ప్రతీ దేవాలయం కేంద్రంగా గ్రామస్తులంతా సామూహిక హారతి నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని ప్రతి గ్రామంలో జరపాలన్నారు. ఈ నెల18 నుంచి 26 వరకు పంచాయతీ కేంద్రంగా భారత మాత పూజలను గ్రామ ధార్మికజట్టుతో నిర్వహించనున్నామన్నారు.



నాయుడుపాలెంలో పల్లకీ సేవలో భక్తులు

'ఓబీసీ ఉద్యోగుల ఐక్యతకు చిచ్చు పెట్టేందుకే..'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, ఓబీసీ ఉద్యోగుల ఐక్యతకు చిచ్చు పెట్టేందుకే సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్యానల్ వేశారని మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్యానల్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ ఆరోపించారు. శనివారం జరగనున్న స్టీల్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఓబీసీ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తమపై దుష్ప్రచారాలు చేయడం ద్వారా వారు గెలవాలని యోచిస్తున్నారన్నారు. అధ్యక్షుడు కోమటి రవిశంకర్ మాట్లాడుతూ తమను గెలిపిస్తే ప్లాంట్‌లో ఓబీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, కొణతాల శ్రీనివాస్, పిల్లి చంద్రరావు, వి.ఎం. నాయుడు, ఎల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ